విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

కోడ్ కష్టాలు

- శుభకార్యాలపై ఎఫెక్ట్
- పెళ్లి పైసలకూ లెక్క చూపాల్సిందే
- సామాన్యులకు అవస్థలు
- గిఫ్టుల తరలింపులకూ నిబంధనలు

విశాలాంధ్రబ్యూరో-ఏలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంక్షలు శుభకార్యాలపై ప్రభావం చూపుతున్నాయి. కళ్యాణాల నిర్వహణకు కోడ్ ఓ పరీక్షగా మారింది. వ్యాపార లావాదేవీల విషయం, ఇతరత్రా పనుల నిమిత్తం సామాన్య ప్రజలు నగదును తీసుకువెళ్లేందుకు జంకుతున్నారు. కట్న కానుకల మాట దేవుడెరుగు కనీసం పెట్టుబడి చీరలు కూడా ఒకేసారి తీసుకువెళ్లడానికి లేకుండా పోయింది. పెళ్లిళ్లకు నగలు, వస్త్రాలు భారీ ఎత్తున కొనుగోలు చేస్తుంటారు. ఇందు కోసం ఉమ్మడి జిల్లా ప్రజలు ప్రధాన పట్టణాలతో పాటు సమీపంలోని నగరాలకు వెళుతుంటారు. పోలీసులు చెక్ పోస్టుల వద్ద నిఘా పెట్టడంతో కొనుగోలు చేసిన వాటికి తగిన ఆధారాలు చూపాల్సిందేనని అధికారులు హెచ్చరిస్తుండడంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎవరైనా రూ.50 వేలు మించి నగదును తీసుకుని వెళ్ళరాదని ఆదేశాలు ఉన్నాయి. సరైన ఆధారాలు చూపకుంటే పట్టుబడిన నగదును వెంటనే సీజ్ చేస్తున్నారు. దీంతో శుభకార్యాలు చేసుకుంటున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది.

భారీగా వివాహాలు

మార్చి, ఏప్రిల్ నెలలో భారీగా శుభ ముహూర్తాలు ఉండడంతో ఉమ్మడి జిల్లాలో వందలాది వివాహాలు జరగనున్నాయి. పెళ్లి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకోవడం తెలుగు సంప్రదాయం. ఇందుకోసం రూ. లక్షలకు లక్షలు ఖర్చు చేస్తుంటారు. ఒకరి కంటే మరొకరు పోటీపడుతూ హంగు ఆర్భాటాలతో 3 నుండి 5 రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నారు. గిఫ్టల సంస్కృతి బాగా పెరిగింది. బంధుమిత్రులు భారీగా హాజరవుతుంటారు. వీటన్నింటి పైన జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోంది.

నగలు, దుస్తుల రవాణాకు తిప్పలు

ప్రస్తుతం ఎన్నికల కోడ్ కారణంగా జిల్లా సరిహద్దుల వద్ద ప్రధాన రహదారులలో పోలీసు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నగదు తరలింపు జరగకుండా కట్టుదిట్టం చేస్తున్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితి నెలకొంటోంది. సాధారణంగా పెళ్లి దుస్తులు, నగలను విజయవాడ, రాజమండ్రి, ధనవంతు లైతే కంచి, ధర్మవరంలలో ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. దీంతో పాటుగా వంటలు తయారు చేసే వారికి రూ.1 లక్ష నుంచి 2లక్షల వరకు ఇవ్వాల్సి ఉంటుంది. వంట తయారీకి అవసరమైన సరుకులు రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు అవుతున్నాయి. కళ్యాణ మండపం, డెకరేషన్స్, ఈవెంట్ నిర్వాహకులకు డబ్బులు ఇచ్చేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. దూర ప్రాంతాలకు వెళ్లి అవసరమైన వాటిని కొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సరైన ఆధారాలు చూపకుంటే పట్టుబడిన నగదు వెంటనే చేతికి రావడం లేదు. శుభకార్యాలు చేసుకుంటున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది.

చేబదుళ్ళూ కష్టమే

అత్యవసర పరిస్థితులలో చేబదుళ్ళు ఇచ్చేవారూ కోడ్ నిబంధనలతో వెనకడుగు వేస్తున్నారు. ఇచ్చినా లెక్కలు చూపించాల్సి వస్తుందనే భయంతో ముందుకు రావడం లేదు. దీంతో సామాన్యులకు అప్పులు పుట్టడం కష్టంగా మారింది. అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రులలో బిల్లులు చెల్లించేందుకు కొందరు కష్టాలు పడుతున్నారు. కూలి పనులు చేసి దాచుకున్న సొమ్ముకు ఆధారాలు ఎక్కడ నుంచి చూపించగలమని కొందరు ప్రశ్నిస్తున్నారు.

రాజకీయ నాయకులపై దృష్టి సారించాలి

పోలీసులు ఉన్నతాధికారులు సామాన్యులపైనే కాకుండా రాజకీయ నాయకులు, వారి ఇండ్లు, వాహనాలపై దృష్టి సారిస్తే బాగుంటుందని సామాన్యులు పేర్కొంటున్నారు. కేవలం ప్రధాన సెంటర్లలో తనిఖీలు చేశామని చెప్పుకోవడం సరికాదని సామాన్యులు మండిపడుతున్నారు.

ప్రస్తుతం పెళ్లిళ్ళ సీజన్ కావడంతో దుస్తులు, బంగారం కొనుగోలు చేయాలన్నా లక్షలు తీసుకువెళితే కానీ ఆ పనులు జరగవని, ఇలాంటి తరుణంలో సామాన్యులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు, ఆధారాలు చూపిన వాటికైనా అక్కడికక్కడే పరిశీలించి ఇస్తే సామాన్యులకు కొంత ఊరట ఉంటుందని ఇలా కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటే ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

విశాలాంధ్ర-భీమవరం: జిల్లాలో వేసవికాలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా శివారు ప్రాంతాలకు సహితం స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో వేసవిలో తాగునీటి సరఫరా కోసం కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్యతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. తాగునీటి సరఫరాకు మే, జూన్ రెండు నెలలు ఎంతో కీలకమైనవి అన్నారు. కాలువలు కట్టివేసే లోపుగా అన్ని తాగునీటి చెరువులను పూర్తిగా నింపాలని ఆదేశించారు. తాగునీటి పనులు అత్యవసర జాబితాలోనివని, ఎన్నికల నియమావళి మినహాయింపు ఉందన్నారు. తాగునీటి సరఫరా కోసం అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయని, అడిగిన వెంటనే నిధులు ఇవ్వడం జరుగుతుందని, ఎక్కడా నీటి ఎద్దడి ఎదురుకాకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా శివారు ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి నీటి సరఫరా చేయాలన్నారు. ఆయా మండలాల పరిధిలో అవసరమైన చోట చేతిపంపుల మరమ్మత్తులను చేపట్టాలన్నారు. ఎక్కడైనా నీటి సరఫరా జరగకపోతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వృధాపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సేవ్ వాటర్ క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. జిల్లాలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన తాగునీటి పనులను ముందుగానే చేసుకోవాలని, లీకేజీలు జరుగుతున్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. వేసవిలో ఎలాంటి డయేరియా కేసులు రాకుండా పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని, డ్రైన్స్ శుభ్రంగా ఉంచాలన్నారు. ఉపాధి హామీ పనుల కింద వాటర్ ట్యాంక్‌లు, కాలువలు, ఇన్ అండ్ అవుట్ లెట్ ఛానల్స్ పూడికచేత పనులను పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అన్ని వాటర్ ట్యాంకులను క్లీనింగ్ వెంటనే చేపట్టి సంబంధిత రిజిస్టర్ నందు నమోదు చేయాలన్నారు. పంచాయతీలలో నిధులు లభ్యతను బట్టి అవసరమైన చోట ఫిల్టర్ బెడ్స్ ను మార్పు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, ఇరిగేషన్ ఈఈ దక్షిణామూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ బి.ఇ నాగేశ్వరరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ శ్యామల, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సువిధ పోర్టల్‌లో నమోదైన దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించాలి : కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: ఎన్నికల ప్రచారానికి సంబంధించి వివిధ అనుమతులకోసం సువిధ పోర్టల్‌లో అందిన దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి అనుమతులు జారీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఎన్ని కల నిర్వహణకు సంబంధించి వివిధ అంశాలపై రిటర్నింగ్ అధికారులు, సంబంధిత నోడల్ అధికారులతో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఎన్నికల అనుమతులను ప్రోసెస్ చేయడానికి సింగిల్ విండో విధానంగా భారత ఎన్నికల సంఘం ప్రారంభించిన సువిధ పోర్టల్ ద్వారా రాజకీయ పార్టీలు లేదా అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి సంబంధించి అనుమతి కోరుతూ చేసిన అభ్యర్థనలను క్షుణంగా పరిశీలించి ఎటువంటి జాప్యం లేకుండా అనుమతులు జారీ చేయాలన్నారు. ఆన్ లైన్లో స్వీకరించిన అనుమతి అభ్యర్థన ఎన్ కోర్ సిస్టమ్ ద్వారా ఆమోదం కోసం సంబంధిత అధికారి వివిధ విభాగాల నోడల్ అధికారులకు అందే అనుమతులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా నగదు ,మద్యం, బహుమతులు వంటివి అక్రమ రవాణా కాకుండా స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఏక్కడ అలసత్వానికి తావివ్వరాదన్నారు. ఇందుకు సంబంధించి సంబంధిత రిటర్నింగ్ అధికారులు కూడా తనిఖీలను పరిశీలించాలన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కృషి

విశాలాంధ్ర-భీమవరం: ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వ హించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.స్థానిక కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన ఎన్నికల కమాండ్ కంట్రోల్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు, వారి వినతుల స్వీకరణకు వివిధ వ్యవస్థలను అందుబాటులో ఉంచామన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకొనేందుకు ఇవన్నీ దోహదపడతాయని తెలిపారు. అత్యంత కీలకమైన ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు, ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేసేందుకు, ఎన్నికల ప్రక్రియపై నిరంతర నిఘా కోసం, వివిధ విభాగాలతో ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటయ్యిందన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఏర్పాటైన ఈ ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌లో కంప్లయింట్ సెల్ ముఖ్యమైన పాత్రను పోషిస్తోందన్నారు. దీని ఆధ్వర్యంలో సి-విజిల్, కాల్ సెంటర్, 1950 హెల్ప్‌లైన్ తదితర విభాగాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కర్ రావు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ సిహెచ్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 8 చెక్ పోస్టుల ఏర్పాటు

- జిల్లా ఎస్పి మేరీ ప్రశాంతి

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: ఏలూరు జిల్లాలో 8 చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి డి. మేరీ ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ వారి మోడల్ కూడా కండక్ట్ రూల్స్‌ను అనుసరించి సదరు చెక్‌పోస్ట్‌ల వద్ద 24 గంటలు వాహనాల తనిఖీ చేయనున్నారు.

ఇప్పటివరకు ఈ చెక్ పోస్ట్ వద్ద.రూ. 53 లక్షల97వేలు నగదు, 1154.1 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు. రూ.8 లక్షల 87వేల విలువగల ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని, అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆకస్మికంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు.ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన దగ్గర నుండి 31 ఫ్లయింగ్ సర్వే టీములు పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. కోడ్ వచ్చిన దగ్గరనుంచి ఇప్పటివరకు జిల్లాలో రూ.10 లక్షల36 వేల710నగదు, 1398 లీటర్ల మద్యం సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. కేంద్ర బలగాలతో సమస్యాత్మక గ్రామాలలో కవాతు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఇండియా కూటమి అభ్యర్ధులను గెలిపించాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-కుక్కునూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కుక్కునూరు మండలంలో జిన్నెలగూడెం, రెడ్డిగూడెం,తదితర గ్రామాల్లో పార్టీ నాయకుల బృందంతో కలిసి విస్తృతంగా పర్యటించి,ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పార్టీ పోలవరం నియోజకవర్గం అభ్యర్థి కారం దారయ్య అధ్యక్షతన కుక్కునూరులో సమావేశం జరిగింది. ప్రజాస్వామ్యాన్ని,లౌకిక తత్వాన్ని, మానవత్వాన్ని మంట కలుపుతున్న బిజెపిని, ఆ పార్టీని బలపరుస్తున్న కూటమిని చిత్తు,చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ రాష్ట్రానికి పెద్ద పరిశ్రమ అయిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకర ణకు పూనుకోవడం హేయమైన చర్య అన్నారు. ఈ రాష్ట్రానికి మరో మణిహారమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్మరించడం, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, విశాఖ రైల్వే జోన్, విభజన హామీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఆ హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు అతి ముఖ్యమైనవని, రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకే తానులో ముక్కలని, ఎవరు గెలిచినా మతతత్వ బీజేపీకే సహకరిస్తారని తద్వారా ప్రజాస్వామ్యం అపహస్యం పాలవుతుందని అన్నారు. విజ్ఞులైన ప్రజలు గత ఐదు సంవత్సరాల పాలకుల తీరును గమనంలోకి తీసుకొని మతతత్వ పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమిని, అవినీతి కంపుతో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని అన్నారు. నియోజక వర్గంలోని ఏడు మండలాల్లో సిపిఐ అభ్యర్థి కారం దారయ్య పార్టీ శ్రేణులతో మమేకమై విస్తృతంగా పర్యటించడం జరుగుతుందని కృష్ణ చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు మైసాక్షి వెంకటాచారి, సన్నేపల్లి సాయిబాబా, జంపన వెంకట రమణ రాజు, కారం దారయ్య, కొన్నె లక్ష్మయ్య, వరకా శ్యామల, కూరాకుల బాబురావు, జిల్లా సమితి సభ్యులు అయితా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పొత్తు ధర్మాన్ని పాటిద్దాం

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం ఏర్పడిన కూటమి పొత్తు ధర్మాన్ని పాటిస్తూ కూటమి అభ్యర్థిని గెలిపించాలని తెదేపా నాయకులకు, జనసేన శ్రేణులకు రెడ్డి అప్పల నాయుడు, కూటమి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పిలుపునిచ్చారు.. ఏలూరు పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

కూటమితో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందుల్ని ఇరు పార్టీల నాయకులకు తెలి పారు. తెదేపా, జనసేన కార్యకర్తల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైకాపా సామాజిక మాధ్యమాలు వేదికగా చేస్తున్న కోవర్టు రాజకీయాలను వివరించారు. అనంతరం రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి కారణంగా రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను తొలగించేందుకు తెదేపా, భాజపా, జనసేన కూటమిగా ఏర్పడ్డాయని అన్నారు. వైకాపా ప్రభుత్వ అంతమే మన లక్ష్యం కావాలని అన్నారు. పోటీలో తాను ఉన్నట్లుగానే భావించి ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి గెలుపునకు జన సైనికులు పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కూటమి అభ్యర్థి బడేటి చంటి మాట్లాడుతూ రెడ్డి అప్పల నాయుడు త్వరలో తెలుగుదేశం నాయకుడు లోకేష్ బాబుతో మాట్లాడుతారని తెలిపారు.ఏది ఏమైనప్పటికీ ఏలూరు నుంచి నియోజకవర్గంలో తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల ఉమ్మడి లక్ష్యం వైసిపిని గద్దె దించడమేనని స్పష్టం చేశారు. .ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల కన్వీనర్ రాఘవయ్య చౌదరి, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్,జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, టిడిపి నగర అధ్యక్షులు పెద్ది బోయిన ప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు చోడే వెంకటరత్నం, టౌన్ సెక్రటరీ రెడ్డి నాగరాజు, జనసేన నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు హుష్?

ఉద్యోగుల తీరు చర్చనీయాంశం

విశాలాంధ్ర - లింగపాలెం : ఎన్నికల నిబంధనలున్నా లింగపాలెం మండల కేంద్రంలో పలు కార్యాలయాలలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు, మండల పరిధిలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కొందరు ఎన్నికల క్యాంపెయినర్లుగా పనిచేస్తుండటంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉద్యోగులు లోపాయికారిగా రాజ కీయ కార్యకలాపాలు సాగిస్తున్నారు. పనుల కోసం వీరి వద్దకు వచ్చేవారిని, రాజకీయ పరిస్థితులపై ఆరాతీసి తమ నాయకులకు అనుకూలంగా ఉండేందుకు అవగాహన కల్పించే సంఘటనలు జరుగు తున్నాయి. గ్రామాలలో వివిధ విభాగాలకు చెందిన కొందరు ఉద్యోగులు ఆ గ్రామాలలో అనుకూలమైన రాజకీయాలు చేస్తున్నారు. ఏ పార్టీకి ఎలా ఉందనే సర్వేలు చేస్తూ ఈ ఉద్యోగులు ప్రజలకు వివరిస్తున్నారు. అన్ని పార్టీలకు మద్దతుగా ఉద్యోగులు ఉండటంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవటంలేదనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల నిబంధనలను పగడ్బందీగా అమలు చేస్తున్నా ఈ మండలంలో క్యాంపెయినర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రం వాటిని పట్టించు కోవటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయాలలో పనిచేసే కొందరు ఉద్యోగుల పనితీరుపై విమర్శలు తలెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్‌కు ముందు ఇటువంటి ఉద్యోగులు రాజకీయ అండతో ఇష్టాను సారంగా ఉండేవారు. ఎన్నికల కోడ్ వచ్చాక ఎన్నికల అధికారుల పర్యవేక్షణ ఉన్నప్పటికి ఈ ఉద్యోగులు కార్యాలయాలకు ఎప్పుడు వస్తారో ? ఎప్పుడు వెళ్తారో వారికే తెలియాలి. వారు పనిచేసే సీట్లలో కాసేపు కూడా కూర్చోలేరు. బయోమెట్రిక్ మాత్రం వేస్తారు. వీరికి చేయటానికి పెద్దగా పనికూడా కార్యాలయాలలో లేదు. పనిలేదని రాజకీయాలు చేస్తున్నారు. ఇటువంటి ఉద్యోగులను పని ఉండే చోటికి పంపితే మేలని పలువురు అంటున్నారు. ఎన్నికల అధికారులు మండ లంపై ప్రత్యేక దృష్టి పెట్టి నిబంధనలను ఉల్లంఘించే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని, కార్యాలయాలలో నిర్లక్ష్యంగా ఉండేవారిపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ మద్యం అరికట్టేందుకు చర్యలు

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్రమ మద్యం అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నక్క సూర్యచంద్రరావు అధికారులను ఆదేశించారు.

స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్,తెలంగాణ సరిహద్దు జిల్లాల ఎస్ ఈ బి ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైనందున అక్రమ మద్యం రవాణా జరగకుండా కృష్ణారావు పాలెం,పర్వతాపురం చెక్పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోకి అక్రమంగా మద్యం సరఫరా కాకుండా ఇరు రాష్ట్రాల అధికారులు సంయుక్తంగా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి సమాచారాన్ని ఒకరికొకరు అందజేసుకుంటా మన్నారు.ఈ సమావేశంలో ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ కే రామకృష్ణ, నూజివీడు ఎక్సైజ్ సీఐ పివి రమణ, ఎంవివిబి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్ పేరుతో డబ్బు వసూళ్లు

ఓ ఉద్యోగి ప్రమేయంతో కొనసాగిస్తున్న వ్యవహారం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో పరీక్షా కేంద్రాలలో మాస్ కాపీయింగ్ చేసేందుకు ఓ ఉద్యోగి పాఠశాలల నుంచి వేల రూపాయలు వసూలు చేసిన సంఘటన చర్చనీయాంశం అయ్యింది. గతంలో పాఠశాలలో పనిచేసి ప్రస్తుతం వేరే శాఖలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి ఈ వ్యవహారాన్ని నడుపుతున్నట్లు తెలిసింది. పరీక్షా కేంద్రాలలో ఇన్విజిలేటర్లను మేనేజ్ చేసి విద్యార్థులందరినీ ఉత్తీర్ణులు చేయిస్తానని ప్రలోభ పెట్టి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలో 8 ప్రభుత్వ పాఠశాలల్లో, ఐదు ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 600 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. మండలంలోని ధర్మాజీగూడెంలో రెండు, సింగగూడెం, రంగాపురంలో ఒక్కొక్క పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు పాఠశాలల నుంచి డబ్బులు వసూలు చేసి కేంద్రాల వద్ద పరీక్షలు రాసే విద్యార్థులకు బయట నుంచి స్లిప్పులు పంపుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పలువురు ఇన్విజిలేటర్లు ఆరోపణలు చేస్తున్న డబ్బులు వసూలు చేసిన ఉద్యోగి తన కార్యకలాపాలను సాగించడంపై ఇన్విజిలేటర్లు ఆందోళన చెందుతున్నారు. గతంలో పాఠశాలలో పనిచేసిన ఈ ఉద్యోగి కేవలం డబ్బులు కోసమే ఇటువంటి సంఘటనలకు పాల్పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. డబ్బులు వసూళ్లను వ్యతిరేకించి ఇటువంటి అక్రమాలకు డబ్బులు ఇవ్వబోమని రెండు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు వ్యతిరేకించినట్టు సమాచారం. వీరి నుంచి ఈ సంఘటన వెలుగు చూసింది. కొన్ని ఏళ్లుగా ఈ ఉద్యోగి ఇటువంటి వసూళ్లకు పాల్పడుతున్నాడని దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని అనేకమంది ఉన్నతాధికారులను కోరుతున్నారు.

చేనేత కార్మికుని ఆత్మహత్యలకు కారకులపై కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర - ఏలూరు : కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు పాల సుబ్బారావు ఆయన భార్య పద్మావతి కుమార్తె వినయ ఆత్మహత్యలకు కారకులైన రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుబ్బారావు పొలాన్ని రెవెన్యూ అధికారులు వైసిపి నాయకులకు తప్పుడు పత్రాలు ద్వారా అప్పగించడాన్ని భరించలేక సుబ్బారావు భార్య, కుమార్తె ఆత్మహత్యల కు పాల్పడ్డారని ఆయన తెలిపారు .ఆత్మహత్యలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కన్నయ్య డిమాండ్ చేశారు. సుబ్బారావు భూమిని రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నాయకుల పేరిట రికార్డుల్లో మార్పించడం దారుణమని ఈ విషయంపై సుబ్బారావు రెవెన్యూ అధికారుల చుట్టూ అనేకసార్లు తిరిగినా ఫలితం లేక మనస్థాపానికి గురై ఏమీ చేయలేని పరిస్థితిలో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారని కన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయలు చొప్పున సుబ్బారావు మరో కుమార్తెకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సుబ్బారావు కుటుంబాన్ని ఆదుకోకపోతే ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ బాట పడతాదని కన్నయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నాగేంద్ర మృతికి సంతాపం

విశాలాంధ్ర - కామవరపుకోట : రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ సీనియర్ నాయకుడు మీసుగుల దుర్గారావు కుమారుడు నాగేంద్ర మృతికి రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు టీవీఎస్ రాజు, జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ప్రగాఢ సంతాపం తెలిపారు. యూనియన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనే నాగేంద్ర మూర్తి యూనియన్ కి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో మృతి చెందిన నాగేంద్రకు యూనియన్ నాయకులు కోతాటి వెంకటేశ్వరరావు, బీవీ రాఘవులు, బాలేని రమణారావు, చలమల శ్రీనివాసరావు, మారం సత్యనారాయణ, సిపిఐ నాయకులు జి. సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

రహదారులలో పోలీసుల తనిఖీలు

విశాలాంధ్ర- భీమవరం టౌన్: ప్రధాన ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రయాణికులు 50 వేలకు మించి అదనంగా నగదు తీసుకు వెళ్ళకూడదని, ఎలక్షన్ కమిషనర్ నిబంధనతో ప్రధాన రహదారులలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వాహనాలు తనిఖీలు ముమ్మరం చేశారు. మంగళవారం భీమవరం నుండి నరసాపురం వెళ్లే ప్రధాన రహదారి, తాడేరు రోడ్ సమీపంలో స్పెషల్ స్క్వాడ్ ఆఫీసర్ శ్రీపతి, సీఐ స్వామి కార్ల, వాహనాలు ను తనిఖీలు నిర్వహించారు.



ఉపాధ్యాయ సంఘానికి మీనా కుమారి సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: సుదీర్ఘ కాలం పాటు ఉపాధ్యాయ వృత్తికి అంకితమై ఎందరో విద్యార్థుల ఉన్నతికి కృషిచేసి స్వచ్ఛంద పదవి విరమణ చేసిన ఎస్‌టీయు నాయకురాలు ఎస్.మీనా కుమారి గృహప్రవేశం సందర్భంగా వారి ఇంటి వద్ద ఎస్ టి యు ఆగిరిపల్లి మండల శాఖ చిరు సన్మాన సభను ఏర్పాటు చేసింది .

ఈ సందర్భంగా ఎస్ టి యు సీనియర్ నాయకులు సిహెచ్ విఆర్ఎస్ సురేష్ కుమార్ మాట్లాడుతూ మీనా కుమారి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ సబ్జెక్ట్‌లో 18 సంవత్సరాల పాటు వరుసగా పదవ తరగతి పరీక్షలలో నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యేటట్లు కృషి చేశారని కొనియాడారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘానికి ఆమె ఎనలేని సేవలందించారని తెలిపారు. ఈ సందర్భంగా మీనా కుమారి మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం రూ.10వేలు ఎస్ టి యు ఆగిరిపల్లి మండల శాఖకు విరాళం ప్రకటిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ టి యు ఆగిరిపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మక్కె వేణుగోపాలరావు, వంశీ వశిష్టలు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీయు నాయకులు తాడి ప్రసాద్,తోట బాలస్వామి, కే జయ రావు, విఠల్, అంకం వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈదర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ గూటికి చిన్నం రామకోటయ్య

విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించి హడావిడి చేసిన నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య మంగళవారం నాడు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. తొలుత 2009లో తెలుగుదేశం ఎమ్మెల్యేగా నుంచి విజయం సాధించిన చిన్న రామకోటయ్య అనంతర కాలంలో తెలుగుదేశాన్ని వీడి 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా నూజివీడు ఎన్నికల బరిలో నిలిచి పరాజయం పాలయ్యారు.అనంతరం 2019లో ఏలూరు ఎంపీగా బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పొందారు. తాజాగా గత కొంతకాలంగా నూజివీడులో స్వతంత్ర అభ్యర్థిగా నిలుస్తున్నానంటూ ప్రచారం ప్రారంభించి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులను సమీకరించే ప్రయత్నం చేశారు. తాజాగా మంగళవారం రామకోటయ్య ఫ్యాన్ గూటికి చేరారు.

పత్రాలు లేకపోవడంతో 1లక్షా 50వేలు సీజ్

విశాలాంధ్ర - నిడమర్రు: మంగళవారం మధ్యాహ్నం నిడమర్రు పోలీస్ వారు ఎఫ్ ఎస్ టి టీమ్ ఇన్‌చార్జి షేక్ హబీబ్ బాషా డీఈవో వారి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. భువనపల్లి గ్రామం దుర్గమ్మ గుడి వద్ద తనిఖీలు చేస్తుండగా ఉంగుటూరు మండలం సీతారాంపురం గ్రామం నుండి భీమవరం వెళ్తున్న ఎ పి 37 డియం 5868 నంబర్ గల కారులో ఎటువంటి పత్రాలు లేని 1లక్ష 50వేల రూపాయలు నడింపల్లి రాజన్ రాజు వద్ద నుండి సీజ్ చేసి ఏలూరు ట్రెజరీకి ఎఫ్‌ఎస్‌టి ఇన్‌చార్జి పంపినట్టు నిడమర్రు ఎస్ఐ ఆర్. శ్రీను తెలిపారు.

స్వచ్ఛందంగా ఓటు వేయాలి

విశాలాంధ్ర -భీమవరం: ఓటు విలువ తెలుసుకుని ఓటు స్వచ్ఛందంగా వేయడం మన నైతిక బాధ్యతని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ గట్టెం మాణిక్యాలరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగం వాటి ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటును బలమైన హక్కుగా భావించాలని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావడం గొప్ప విశేషమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భారత దేశంలో ఓటు కీలకమని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో భీమవరం లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరంలో 282 మందికి పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం వల్లూరు గ్రామ ఎంపీ యూపీ స్కూల్‌లో ఆరోగ్య సురక్ష క్యాంపు అధికారి డాక్టర్ పి. కిరణ్మయి ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్ట్ డాక్టర్ కె. సుధాకర్ (ఎండి .జనరల్ మెడిసిన్) డాక్టర్ రాఘవేంద్ర ఆర్థోపెడిక్ సర్జన్ (ట్రినిటీ హాస్పిటల్ తాడేపల్లిగూడెం,కంటి వైద్యులు, ఐ శ్రీనివాస్, కమ్యూనిటీ హెల్త్ అధికారి జె.విల్సన్ బాబు , ఎం ఎల్ హెచ్ పి ఎస్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, పాల్గొన్నారు. శిబిరానికి 282 మంది వచ్చినట్లు డాక్టర్ పి. కిరణ్మయి తెలిపారు.

ప్రచార బోర్డు తొలగింపు

విశాలాంధ్ర - నిడమర్రు: ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండలం భువనపల్లి పంచాయతీ పరిధిలో ఒక కాంప్లెక్స్ పై ఒక పార్టీకి సంబంధించిన ప్రచార బోర్డు ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదు పై సంబంధిత ప్రచార బోర్డును భువనపల్లి పంచాయతీ కార్యదర్శి ద్వారా తొలగించినట్టు ఉంగుటూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్డీవో ఎస్.ఎస్. కె ఖాజావలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ

విశాలాంధ్ర-టి నరసాపురం: టి నరసాపురం సొసైటీ వాటర్ ప్లాంట్ మూయడానికి కారణాలు, ప్లాంట్ లో పని చేసే సిబ్బందికి న్యాయం చేయాలని, సొసైటీలో విలువైన సామాగ్రి చోరీకి బాధ్యులెవరు నష్టాన్ని వసూలు చేయాలని ఇటీవల స్పందనలో టి నరసాపురం గ్రామానికి చెందిన డి. విల్సన్ బాబు ఫిర్యాదు చేయడంతో జిల్లా కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మోహన్ బాబు మంగళవారం విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

ఎండ ధాటికి తల్లడిల్లుతున్న చిన్నారులు

విశాలాంధ్ర - పాలకోడేరు : రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలకు ఈనెల 18వ తేదీ నుండి ఒంటి పూట బడులు నిర్వహిస్తున్న ప్రభుత్వం అంగన్వాడి స్కూళ్లకు మాత్రం ఇంకా ఒంటిపూట బడుల నిర్వహణకు మార్గదర్శకాలు జారీ చేయలేదు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంవల్ల అంగన్వాడికి వెళ్లే చిన్నారులు ఎండ వేడిమికి తట్టుకోలేక తల్లడిల్లి పోతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాలకోడేరు మండలంలో మొత్తం 66 అంగన్వాడీ కేంద్రాలు, మూడు మినీ అంగన్వాడి కేంద్రాలున్నాయి. అంగన్వాడికి వచ్చే చిన్నారులు సాయంకాలం వరకు స్కూల్లోనే ఉండాలంటే ఎండవేడికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఒంటిపూట బడులు ఎప్పుడు నిర్వహిస్తారని మండల అంగన్వాడి సూపర్వైజర్ పార్వతిని సంప్రదించగా తమకు ఎటువంటి సమాచారం లేదని ఈ విషయమై తమ ఉన్నతాధికారులను సంప్రదించాలని తెలియజేశారు. ఇదే విషయమై ఆకివీడు సీడీపీఓ వాణి విజయరత్నంని ఫోన్లో సంప్రదించగా ఇప్పటికైతే తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని తెలియజేశారు.

ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబు

విశాలాంధ్ర-ఆచంట: చంద్రబాబు, వారి మద్దతుదారులు అందరూ ప్రజలను మభ్యపెట్టి మోసం చేయడం వారికి అలవాటుగా మారిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం ఆచంట మండలం వల్లూరులో నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలతో కలపి గడపగడపకూ విస్తృత ప్రచారం నిర్వహించారు. వల్లూరు ప్రజలు శ్రీరంగనాథరాజుకు మహిళలు నీరాజనం పలికారు. సీఎం జగన్ సామాజిక న్యాయాన్ని పాటించి చూపారన్నారు. బీసీలను నమ్మించి మోసం చేయడంలో ఘనుడు చంద్రబాబు అని విమర్శించారు. ప్రతీ ఒక్కరూ సీ ఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. పార్లమెంటు అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ మహిళలకు సామాజిక, రాజకీయ భద్రత కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట

విశాలాంధ్ర - కలిదిండి : శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మంగళవారం మండలంలోని సాన రుద్రవరం గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ మంత్రి కామినేని. శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోకల. జోగిరాజు, జనసేన పార్టీ నాయకులు నల్లగోపుల చలపతి, పేటేటి సత్యనారాయణ, తట్టుగోళ్ళ. నాంచారయ్య, పైడిపాటి శివశంకర్, వలవల రవితేజ, పడమట అబ్బులు, నీలపాల సుబ్బారావు, మిత్ర పక్షాల నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బయోలాజికల్ పరీక్షకు 11 మంది గైర్హాజరు

విశాలాంధ్ర-పాలకోడేరు: మంగళవారం జరిగిన పదవ తరగతి బయోలాజికల్ సైన్స్ పరీక్షకు మండల వ్యాప్తంగా 612 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవలసి ఉండగా 601 మంది విద్యార్థులు మాత్రమే హాజరై 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పాలకోడేరు మండల విద్యాశాఖ అధికారి 1 పెనుమత్స వెంకట శివ నాగరాజు తెలిపారు. పాఠశాలల వారీగా పాలకోడేరు హై స్కూల్ నుండి 145 మంది విద్యార్థులు హాజరవలసి ఉండగా 142 మంది, శృంగ వృక్షం హై స్కూల్ నుండి 150 మంది విద్యార్థులు హాజరవలసి ఉండగా 157 మంది, విస్సా కోడేరు హై స్కూల్ నుండి 63 మంది విద్యార్థులు హాజరవలసి ఉండగా62 మంది, మొగల్లు హై స్కూల్ నుండి 128 మందివిద్యార్థులుహాజరవలసి ఉండగా 122 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్టు ఒక ప్రకటనలో ఆయన తెలియజేశారు.

వైకాపాలోకి భారీ చేరికలు

విశాలాంధ్ర-తణుకు: వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీలనేతలు కార్యకర్తలు ఆకర్షితులై వైకాపాలో చేరుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా తణుకు వైసీపీ కార్యాలయ ఆవరణలో 25, 27,30 వార్డులు నుంచి 200 కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమక్షంలో వైకాపాలో చేరారు. వీరికి మంత్రి కారుమూరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి రానున్న ఎన్నికలలో వైసీపీ ఘన విజయానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, యూత్ అధ్యక్షులు చేశెట్టి లలితా శంకర్,బాబి, కొల్లు బాబు, జిలాని, రామకృష్ణ,వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు కారుమూరి అభిమానులు తదితరులు పోల్గొన్నారు.

విద్యార్థినికి రాయపూడి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పాలకొల్లు : ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేదలను ఆదుకోవడంలో కలిగే ఆనందం వెలకట్టలేదని జి వి ఎస్ వి ఆర్ ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ అన్నారు. సిర్రా నిఖిత అనే ఒక పేద విద్యార్థినికి, తన పరీక్ష ఫీజు కట్టుకునేందుకు కూడా డబ్బు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని సమాచారం తెలుసుకున్న రాయపూడి భవాని ప్రసాద్ మానవతా దృక్పథంతో స్పందించారు. మంగళవారం రూ. 5 వేల రూపాయలను తమ పాఠశాల విద్యార్థుల చేతుల మీదుగా, పేద విద్యార్థిని సిర్రా నిఖిత కు సహాయంగా అందజేశారు. భవిష్యత్తులో కూడా తనకు చేతనైన సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. రాయపూడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. చేసేది చిరు సహాయం అయినప్పటికీ సకాలంలో సహాయం అందించడం వల్ల వారి జీవితం మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. జీవీఎస్ వీఆర్ ఎం పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన ఆదిపరాశక్తి సంస్థ నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర-నరసాపురం: తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలో శ్రీ మహాలక్ష్మి కనక మహాలక్ష్మి దుర్గ అమ్మవారి జాతర వార్షికోత్సవంలో స్థానిక ఆదిపరాశక్తి సంస్థ నాట్యాచారిణి వలవల అనంతలక్ష్మి దేవి, రంగినీడి భరణి సుబ్బారావు ఆధ్వర్యంలో వ్యాఖ్యాతగా చేగొండి సత్యనారాయణమూర్తి నిర్వహణలో 40 మంది విద్యార్థులతో మూడు గంటల పాటు కూచిపూడి నాట్యం జరిగింది. అష్టలక్ష్మి స్తోత్రం, మహిషాసుర మర్ధిని రూపకం, శివ తాండవం, గోపిక కృష్ణ గీతాలు శ్రీ వెంకటేశ్వర వైభవం భక్తులను విశేషంగా అలంకరించింది. అనంతరం కమిటీ సభ్యులు నాట్యం బృందాన్ని ఘనంగా సత్కరించారు.

శిలాఫలకంపై ముసుగు

విశాలాంధ్ర - జంగారెడ్డి గూడెం: జంగారెడ్డిగూడెం 12వ వార్డు రాముడు కుంట చెరువులో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాలపై ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే చిత్రాలు దర్శనమిస్తున్నాయని ఫిర్యాదు పై మంగళవారం సంబంధించిన శిలాఫలకాలపై ముసుగు వేసినట్టు చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్, అధికారి జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె. అద్దయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర సుభిక్షానికి కూటమిని గెలిపించాలి

విశాలాంధ్ర-వీరవాసరం: వైసీపీ అరాచక పాలనను అడ్డుకోవాలంటే కూటమిని తప్పనిసరిగా గెలిపించాలని నియోజకర్గ జనసేన అభ్యర్థి పులపర్తి అంజిబాబు కోరారు. మండల టిడిపి ఆధ్వర్యంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు కోల్లేపర శ్రీనివాసరావు అధ్యక్షతన టిడిపి, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశాన్ని వీరవాసరం తులసీ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు సీతారామలక్ష్మి మాట్లాడుతూ జగన్ అయిదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడటంతో పాటు ప్రజల ఆర్థిక స్థితి గతులు దయనీయంగా మారాయన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కూటమి తప్పనిసరిగా గెలవాలన్నారు వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లు ప్రతిపక్ష పార్టీల నాయకులపై వేధింపులను ప్రజలంతా చూశారన్నారు. జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి జరిగిన నష్టాలన్ని ప్రజలందరికి వివరిస్తూ జగన్ ను సాగనంపి, రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి చిత్త శుద్ధితో పనిచేసే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ రానున్నది ఉమ్మడి కూటమి ప్రభుత్వమేనని గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో వైసిపి చేసిన అరాచకాలకు తప్పనిసరిగా తగిన గుణపాఠం చెబుతామన్నారు. మూడు పార్టీల కార్యకర్తలు మాట్లాడుతూ అంజిబాబును అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నేలపోగుల మాజీ సర్పంచి లంక సత్యనారాయణ, వడ్డిగూడెం, తోకలపూడి, జొన్నలపాలెం గ్రామాల్లో వైసిపి నుంచి పలువురు టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, కోశాధికారి మెంటే పార్థసారథి, వేండ్ర శ్రీనివాసరావు, జవ్వాది బాలాజి, వీరవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువత భవితను చిదిమేస్తున్న జగన్

విశాలాంధ్ర-వీరవాసరం: ఆంధ్రప్రదేశ్ యువత భవితను జగన్ డ్రగ్ మాఫియా చిదిమేస్తున్నదని గత ప్రభుత్వాల హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో మొదటి స్థానంలో ఉన్న ఏపీని జగన్ గంజాయి, డ్రగ్ రవాణాలో మొదటి స్థానానికి చేర్చారని జనసేన జెడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు విమర్శించారు. వీరవాసరంలో విశాలాంధ్రతో ఆయన మాట్లాడుతూ కర్ణాటకకు టెస్లా కంపెనీ వచ్చిందని, తెలంగాణకు అమెజాన్ వచ్చిందని, కానీ ఆంధ్రప్రదేశ్‌కు పెద్ద పెట్టుబడిగా బ్రెజిల్ నుండి డ్రగ్స్ కంటైనర్ వచ్చిందని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపిలోనే దొరుకుతున్నాయన్నారు. జగన్ దోపిడీని యువత ప్రశ్నించకుండా, నిలదీయకుండా ఉండటం కోసం మత్తులో దించి గేమింగ్, క్యాసినోతో జాతిని నిర్వీర్యం చేస్తూ తల్లిదండ్రులకు కడుపు కోత మిగులుస్తు న్నాడన్నారు. డ్రగ్స్ కుంభకోణం వెనుక తాడేపల్లి ప్యాలెస్ హస్తం ఉందని, అందుకే వైసిపి నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారని అన్నారు. జగన్ అధికారంలోకొచ్చాక యువతను విస్మరించారని రాబోయే కూటమి ప్రభుత్వం ఉపాధి అవకాశాలకు యువతను ప్రోత్సహిస్తూ పరిపాలన సాగిస్తుందన్నారు.

పేదలకు ఉపాధి పనులు కల్పించాలి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు గ్రామపంచాయతీలలో ఉన్న గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఎం. జీవరత్నం అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ రాజకీయ సౌలభ్యం కోసం ఏలూరు నగరంలో ఏడు గ్రామ పంచాయతీలను విలీనం చేయడం వలన ఆ గ్రామాల్లో ఉన్న పేదలకు ఉపాధి దొరక్క వలసలు పోతున్నారని ఆందోళన చెందారు. వలసల నివారణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ఈ గ్రామాల్లో నిర్వహించకపోవడం వలన వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు ఏళ్ల నుండి పోనంగి గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహించకపోవడంతో ఎక్కువ కుటుంబాలు వలసలు పోయి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. కొంతమంది ఒంటరి మహిళలు ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలవుతున్నారని తెలిపారు. వలస నివారణ కోసం తీసుకుని చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. జిల్లా డ్వామా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన పోరాటాలు సన్నద్ధమవుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏ. రవి, సహాయ కార్యదర్శి ఎస్. మహంకాళి రావు, సత్తు కోటేశ్వరరావు, సాయి, చంటి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా రామ్మోహన్‌నాయుడు

విశాలాంధ్ర-నరసాపురం: టీడీపీ సీనియర్ నాయకులు, ఎన్నారై, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడుకు తెదేపా రాష్ట్ర పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం మంగళవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటన విడుదల చేసారు. కొవ్వలి రామ్మోహన్ నాయుడు కొవ్వలి ఫౌండేషన్ పేరిట పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టిడిపి నుంచి టికెట్ రేసులో కొవ్వలి ఉన్నారు.

మళ్లీ వైసీపీ అధికారంలోకి వచ్చేందుకు కృషి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరలా వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తన వంతు కృషి చేస్తా అని ఉస్సే ప్రదీప్ కుమార్ తెలిపారు. మండలంలో అచ్యుతాపురం గ్రామానికి చెందిన ప్రదీప్ కుమార్‌ను అచ్యుతాపురం గ్రామపంచాయతీ పరిధిలో గల గ్రామాలకు వైయస్సార్ పార్టీ యూత్ ప్రెసిడెంట్‌గా నియమించారు. తనకు ఈ పదవి బాధ్యతలు అప్పజెప్పిన పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజుకు, పోలవరం వైఎస్ఆర్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మికి, యూత్ నాయకులకు,వైయస్సార్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రదీప్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

అజయ్‌కు టిడిపి నేతల పరామర్శ

విశాలాంధ్ర-చాట్రాయి: వెన్నెముకకు శస్త్ర చికిత్స చేయించుకున్న టిడిపి కార్యకర్త బలుసూరి అజయ్ ను తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పరామర్శించారు. మండలంలోని జనార్ధనవరం గ్రామానికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు బలుసూరి రత్తయ్య కుమారుడు అజయ్ వెన్నెముక కు శస్త్ర చికిత్స చేయించుకోవడంతో మంగళవారం జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస రావు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, తెలుగు రైతు మహిళా కార్యదర్శి మాదాసు చంద్రకళ, వంగల సుబ్బారావు, ఈడా శ్రీను, నాగుమల్లి వెంకటేశ్వర రావు తదితరులు వారి నివాసానికి వెళ్ళి పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

వెంకన్న కుటుంబానికి భువనేశ్వరి పరామర్శ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: తెలుగుదేశం పార్టీ నిజం గెలవాలి పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి మంగళవారం మండలంలోని పేరంపేట గ్రామం విచ్చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్నప్పుడు ఆ ఘటన టీవీలో చూసి మృతి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త భీమడోలు వెంకన్న కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అన్ని విధాల సహకారం అందిస్తామని భువేశ్వరి భరోసా ఇచ్చారు. గతంలోనే బాధితుడి కుటుంబానికి రూ.3లక్షల చెక్కును నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ చేతుల మీదుగా అందచేశారు.ముందుగా పేరంపేట విచ్చేసిన భువనేశ్వరిని రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు, చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు ,టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ ,చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ పుష్ప గుచ్చాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి,జనసేన నాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి మండల బి.సి సెల్ అధ్యక్షునిగా చిట్టిబొమ్మ శ్రీనివాస్

విశాలాంధ్ర -జీలుగుమిల్లి: మండల వై.సి.పి బి.సి సెల్ అధ్యక్షునిగా మండల కేంద్రానికి చెందిన చిట్టిబొమ్మ శ్రీనివాస్ నియమితులయ్యారు. పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాలకు చెందిన వై.సి.పి అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాయం సోమవారం రాత్రి ప్రకటించింది.ఈ మేరకు జీలుగుమిల్లి మండల బి.సి సెల్ బాధ్యతలను శ్రీనివాస్ ని నియమించారు. మండల వై.సి.పి బి.సి సెల్ అధ్యక్షునిగా నియమితులైన శ్రీనివాస్ కు జీలుగుమిల్లి మండల వై.సి.పి నాయకులు,కార్యకర్తలు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వై.ఎస్.జగన్ బి.సి లకు అన్ని రంగాలలో పెద్దపీట వేస్తూ బి.సి లంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదని బ్యాక్ బోన్ క్లాస్ అని తెలిపారని, అలాంటి నాయకుడు అధ్యక్షుడిగా ఉన్న పార్టీలో బి.సి సెల్ అధ్యక్షునిగా పనిచేయడం నా అదృష్టమని తెలిపారు. తన కష్టాన్ని గుర్తించి ఈ పదవి రావడానికి కృషిచేసిన సీ.ఎం జగన్,ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, మండల వై.సి.పి అధ్యక్షులు సందా ప్రసాద్,జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు బొడా శ్రీనివాసరెడ్డి, నాయకులు,కార్యకర్తలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన అన్నారు.

అరుణాచలంలో అరుదైన నృత్య ప్రదర్శనకు పట్టణ కళాకారులకు గౌరవం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : పట్టణానికి చెందిన ప్రజా కళాకారుడు, జానపద కళా రత్న ఎల్. ఆర్. కృష్ణబాబు పర్యవేక్షణలో బండి మల్లిక, సావిత్రి బాయి పూలే మహిళా కోలాట బృందం ప్రొద్దుటూరు వారి నిర్వహణలో కోలాటం గురువు జే. సాయి భరత్ నృత్య దర్శకత్వంలో 111మంది భక్తులచే కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. అరుణాచలం అరుణగిరి చుట్టూ 14కిలోమీటర్లు సాయంత్రం 6గంటలకు ప్రారంభించి, తెల్లవారుజాము 5గంటల వరకు 23గంటలపాటు నృత్య ప్రదర్శన చేసి అరుణ గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు.ఈ ప్రదర్శన వరల్డ్ రికార్డ్ సాధించింది. తెలుగు అసోసియషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ (తానా) బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ,భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు అవార్డ్ లు ఇచ్చి కళాకారులను సత్కరించారు.ఈ సందర్భంగా స్థానిక శ్రీ నూకాలమ్మ అమ్మ వారి ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ,ఆలయ కమిటీ సభ్యులు ఎల్. ఆర్. కృష్ణబాబుకు అభినందనలు తెలియజేశారు. డాక్టర్ రాజాన మాట్లాడుతూ మన ఊరి కళాకారులు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించడం చాలా గొప్ప విషయం అని ప్రత్యేకంగా అభినందించారు. ఎల్. ఆర్. కృష్ణబాబు మాట్లాడుతూ అమ్మ వారి దివ్య అనుగ్రహంతో ఇంతటి గొప్ప పురస్కారాలు పొందగలగడం తమ పూర్వ జన్మ సుకృతం అని అన్నారు. ఆలయ కమిటీ వారికి ప్రత్యేక ధన్యావాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు ఉత్సవ కమిటీ సభ్యులు గాలి నూకరాజు,త్రిపుర రమేష్, నూకల సత్యనారయణ, గ్రామ భక్త మహా జనులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అని ఆలయ మేనేజర్ చిటికెన రాంబాబు తెలియజేశారు.

మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : ఉచిత కుట్టు మిషన్ శిక్షణను మహిళలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ రొక్కాల నాగ బుజ్జి తెలిపారు. తాడేపల్లిగూడెంలో ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి రొక్కాల ఆశీర్వాదం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామని , మహిళలు తనకు తాను స్వయం ఉపాధి కల్పించుకునేందుకు తన కుటుంబ ఆర్థిక పరిస్థితులు చక్క దిద్దుకొనుటకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామని ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని , శిక్షణ పూర్తి చేసిన వారికి ఉచితంగా సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు కాంటాక్ట్ నెంబర్ 6305683467 కు సంప్రదించాలన్నారు.

రాజకీయ పార్టీల పబ్లిసిటీ సమాచారం తొలగించాలి

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆయా రాజకీయ పార్టీల బ్యానర్లు ,హోర్డింగ్స్, స్టిక్కర్లు, వాల్ పెయింటింగ్స్ తదితర పబ్లిసిటీకి సంబంధించినవి ఇప్పటికే తొలగించామని, ఎక్కడైనా ఇటువంటివి వుండేందుకు వీలు లేకుండా వెంటనే తొలగించడానికి సంబంధిత అధికారులకు ఆదేశించామని నూజివీడు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో వై. భవానీ శంకరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ నేతలకు కోడ్ వర్తించదా.. మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టికర్లుకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల పై సంబంధిత ఫ్లెక్సీలను, స్టిక్కర్లను మునిసిపల్ శాఖ అధికారులు తొలగించారన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : చంద్రబాబు తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పేర్కొన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి సెంట్రల్ జైలుకు పంపించిన సమయంలో భావోద్వేగంతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించ దానికి నిజం గెలవాలి అనే కార్యక్రమాన్ని చేపట్టిన భువనేశ్వరి కొయ్యలగూడెం మండలం ఎర్రంపేట, కన్నాయిగూడెం, బయ్యన గూడెం గ్రామాలకు చెందిన చంద్ర చిన్న కన్నయ్య,ఎర్రంపేట , దిర్శిపాము. వెంకటలక్ష్మి,కన్నాయిగూడెం, మార్గాని. వెంకటేశ్వరరావు,బయ్యనగూడెం, వీరి కుటుంబ సభ్యులను పరామర్శించి హామీ పత్రాన్ని అందజేశారు. ఆమెకు ఈ గ్రామాలలో తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే మన కుటుంబ సభ్యులు అని నాన్నగారు ఎప్పుడు చెబుతుండే వారని , ఆయన స్ఫూర్తితోనే చంద్రబాబు ముందుకు నడిచారని , తమ కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు మీరంతా మాకు అండగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమాలలో మాజీ మంత్రి పీతల సుజాత, ఎం ఎల్ సి పంచుమర్తి అనురాధ, మాజీ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, గన్ని వీరాంజనేయులు ,మొడియం శ్రీనివాస రావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందాం

విశాలాంధ్ర-పెంటపాడు: సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని నిలబెట్టుకుందామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి, తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ పిలుపు నిచ్చారు. పెంటపాడు మండలం బి.కొండేపాడు గ్రామంలో మంగళవారం పార్టీ శ్రేణులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. 2014 ఎన్నికల్లోను టిడిపి బిజెపి జనసేన కూటమి కలిసి పోటీ చేశాయని, ఆనాడు చంద్రబాబు ఇచ్చిన 650 హామీలు ఏమయ్యాయి అని కొట్టు ప్రశ్నించారు. మళ్లీ ఇదే కూటమి మాయ మాటలతో, అబద్ధాలతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్నాయి అన్నారు. ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, బి.కొండేపాడు ఎంపీటీసీ దేవరశెట్టి సత్యనారాయణ, కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

నీటి కొరత గ్రామాల్లో తక్షణమే ట్యాంకర్లతో సరఫరా చేయాలి

విశాలాంధ్ర - కైకలూరు : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కైకలూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జయ మంగళ వెంకటరమణ మాట్లాడుతూ నీటి సమస్య ఉన్న గ్రామాలను ముందే గుర్తించి యుద్ధ ప్రాతిపదికన గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా అధికారులు నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలన్నారు. నిరుపయోగంగా ఉన్న బోర్లు,చేతి పంపులను మరమ్మతు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.తాగునీరు వృథా కాకుండా గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాలను ముందే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గ్రామస్థాయిలో నీటి సమస్యలపై పంచాయతీ కార్యదర్శి కీలక బాధ్యత వహించాలని అధికారులను ఆదేశించారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు కార్మికులతో ముఖాముఖి

విశాలాంధ్ర -ఏలూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎన్నికల అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. మంగళవారం కొత్తూరు జ్యూట్ మిల్ కార్మికులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలమైన ప్రజాస్వామ్యం కోసం అర్హులైన పౌరులందరు ఓటు హక్కు వినియోగించుకునే దిశగా జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా స్వీప్ (సిస్టమటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఉన్న కర్మాగారాలలో పనిచేస్తున్న కార్మికులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు, ఏథికల్ ఓటింగుపై ప్రచారం చేస్తున్నామని అన్నారు. జిల్లాలో సుమారు 400 సంస్థలలో ముప్పై వేలమంది కార్మికులు పనిచేస్తున్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అర్హులైన కార్మిక ఓటర్లందరూ తమ ఓటుహక్కు వినియోగించుకునేలా వివిధ రూపాల్లో అవగాహన పరచడం జరుగుతుందన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం తమ కార్మికులు అందరు పోలింగులో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరు పాటించాలని దీనిలో భాగంగా ఓటును నగదుకు, బహుమతులకు అమ్ముకోవడం నేరమని ప్రతిఒక్కరు ఏథికల్ ఓటింగ్ జరిగే విధంగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్మికులతో ఓటుహక్కు వినియోగంపై డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పెదపాడు ఎంపీడీఓ తేజరతన్, తహసీల్దార్ వి. భావన్నారాయణ, డెప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఫ్యాక్టరీస్ ఆర్. త్రినాథరావు, ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ ఎ. శ్రీనివాస్, లేబర్ ఆఫీసర్ జే. గోపాల కృష్ణ, జ్యూట్‌మిల్లు హెచ్.ఆర్ మేనేజర్ సురేష్, విస్తరణ అధికారి సూర్యకుమార్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం పునః ప్రతిష్ట

విశాలాంధ్ర-మండవల్లి: మండల కేంద్రమైన మండవల్లిలో ఏప్రిల్ నెలలో కన్నుల పండువగా బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అసోసియేషన్ మండవల్లి అధ్యక్షుడు కొరపాటి శాంతరాజు అన్నారు.భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డా.అంబేద్కర్ విగ్రహాన్ని,జాతీయ రహదారి విస్తరణలో మరోచోటకు మార్చవలసి రావ టంతో,రోడ్డుకు అవతలవైపు(మంచినీటి చెరువుగట్టు న)నూతనంగా సుందరంగా ఏర్పాటుచేసిన విగ్రహాన్ని అంబేద్కర్ జయంతికి ముందే పునఃప్రతిష్ట కార్యక్రమం కన్నుల విందుగా నిర్వహించాలని స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం శాంతరాజు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు.ఎన్నికల కోడ్ నిబంధనలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించాలని,అంబేద్కర్ భావ జాలం పై ఉపన్య సించే ప్రముఖులతో,అంబేద్కర్ విగ్రహ పునప్రతిష్ట,సభ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు.ఈసందర్భంగాఅసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎల్.ఎస్.భాస్కరరావు,చాబత్తిన విజయ్,మేడేపల్లి సైమన్,మెండ సురేష్,చిగురుపాటి ఐజక్,ముఖ్యసల హోదారు గోరింక గాంధీ తదితరులు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ మహాశయుని కృషి వల్లనే నేడు బహుజనులతో పాటు సకలజనులకు ఆర్థిక, సామాజిక,న్యాయం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కే.రవి వరప్రసాద్,డి.వినోద్ కుమార్, బి.తంబిదాస్, ఎం.రాజేష్,జె.వివేక్, తదిత రులుపాల్గొన్నారు.

యువతతోనే దేశాభివృద్ధి

విశాలాంధ్ర -భీమవరం: యువత భవిష్యత్తుకు తమ కూటమి గొప్ప ఎజెండాతో ముందుకొస్తుందని మాజీ ఎమ్మెల్యే, జనసేన భీమవరం అసెంబ్లీ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని 26వ వార్డుకు చెందిన జనసేన, టిడిపి యువత మాజీ ఎమ్మెల్యేను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కలిసి మెలసి పని చేద్దామని, కూటమిదే విజయమని అన్నారు. యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని, యువత తలుచుకుంటే సాధించలేనిది లేదన్నారు. స్వచ్ఛమైన పారదర్శక పాలనకు యువత ముందుకు రావాలని కూటమి విజయానికి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఫెన్సింగ్ విద్యలో నైపుణ్యం సాధించాలి

విశాలాంధ్ర - రాజానగరం : ఫెన్సింగ్(ఖడ్గ యుద్ధ క్రీడ)లో ఏషియన్ ఛాంపియన్‌షిప్, కామన్ వెల్త్ స్థాయిలో భారత దేశానికే వన్నె తెచ్చిన ఫెన్సింగ్ క్రీడాకారిణి భవానీ దేవిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, తద్వారా ఫెన్సింగ్ విద్యలో మరింత పట్టు, నైపుణ్యం సాధించాలనీ ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మ రాజు అన్నారు. తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాల ఇండోర్ క్రీడా మైదానంలో రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ యువజన, సాంస్కృతిక శాఖ(ఎఫ్ఎఏపి)ఆధ్వర్యంలో 25వ జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్(ఖడ్గ యుద్ధ క్రీడ) చాంపియన్ షిప్ పోటీలను సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైయ్యాయి.క్రీడలకు ముఖ్య అతిథిగా హాజరైన నన్నయ వర్సిటీ వీసీ పద్మరాజు, విశిష్ట అతిథిగా విచ్చేసిన జీఎస్ఎల్ విద్యాసంస్థలు ఛైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ గన్ని భాస్కరరావులు తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.కత్తి చేతబట్టి ఖడ్గాని తిప్పుతూ క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సొంత ఆభరణాలను తాకట్టు పెట్టే స్థాయి నుండి భారత దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరుకున్న ఫెన్సింగ్ క్రీడాకారిణి భవానీ దేవి కష్టాన్ని ప్రతిఒక్కరు గుర్తించాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథిగా హాజరైన జీఎస్ఎల్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ ఖడ్గ యుద్ధ క్రీడలతో ప్రతిఒక్కరికీ ఆత్మస్థైర్యం కలుగుతుందన్నారు.ఎదుటి వ్యక్తి కదిలికలను వేగంగా గ్రహించడం,ఆటపై ఏకాగ్రత సాధించడం వంటి ప్రత్యేక లక్షణాలు పై పట్టు సాధించేందుకు ఫెన్సింగ్ దోహద పడుతుందన్నారు. ఎఫ్ఎఏపి రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.వి కృష్ణ మోహన్ మాట్లాడుతూ పోటీలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 10-14 ఏళ్ల మధ్య వయసున్న క్రీడాకారులు బాలికలు విభాగం లో 250 మంది, బాలుర విభాగంలో 271మంది,160 మంది కోచ్ లు, మేనేజర్లు, టెక్నీషియన్లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పోటీలకు తరలివచ్చారన్నారు.మార్చి 25 నుంచి 28వరకూ 4 రోజులపాటు పోటీలు క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు.

క్రీడా పోటీలు విధివిధానాలు ఇవే -

కత్తి పట్టడం, కత్తి తిప్పడం,కత్తి యుద్ధాలు అనగానే టక్కుమని గుర్తొచ్చే దృశ్యాలు అక్కినేని నాగేశ్వరరావు, కాంతారావు,రామారావు నటించిన సాంఘిక,పౌరాణిక చిత్రాలు అప్పట్లో అందర్నీ ఆకట్టుకునేవి. సినిమాలో మాత్రమే చూసే ఈ ఖడ్గ యుద్ధ క్రీడలు ప్రత్యక్షంగా పోటీలను జీఎస్ఎల్ లో నిర్వహించడంతో వాటిని తిలకించేందుకు విద్యార్థులు,అధ్యాపకులు పలువురు ఆసక్తి కనబరిచారు. జీఎస్ఎల్ ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు జరిగే ఖడ్గ విద్య పోటీలలో నువ్వానేనా అన్న రీతిలో క్రీడాకారులు తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా ఎఫ్ఎఏపి రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్.వి కృష్ణ మోహన్ మాట్లాడుతూ ప్రతి ఇద్దరి క్రీడాకారులు మధ్య మూడు నిమిషాల చొప్పున నిమిషం వ్యవధితో వెంట వెంటనే మూడుసార్లు పోటీ ఉంటుందన్నారు.15 పాయింట్లు సాధించిన వారిని విజేతలుగా నిర్ణయిస్తారన్నారు.పోటీలో నైపుణ్యాలను ఖచ్చితంగా గుర్తించడానికి ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగిస్తున్న ట్లు మాజీ సెక్రెటరీ, అసోసియేషన్ మెంటార్ ఎన్ సురేష్ బాబు చెప్పారు. విజేతలకు బంగారు, వెండి, పతకాలు, రెండు కాంస్య పతకాలు బహుమతులుగా అందిస్తారని తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌లో సత్తాచాటిన విద్యార్థి గణేష్

విశాలాంధ్ర - రాజానగరం : తమ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థి ఉద్దగిరి గణేష్ గుప్త గోదావరి టాలెంట్ టెస్ట్ పరీక్షల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధిం చడం హర్షణీయమని, దివ్యవిద్యా సంస్థల కరస్పాండెంట్ బర్ల సుబ్బలక్ష్మి అన్నారు. ఫిబ్రవరిలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన గోదావరి టాలెంట్ టెస్ట్ ఫలితాలు ఈ నెల25 రాత్రి విడుదలయ్యాయి. రాష్ట్రంలో మొదట ర్యాంకు సాధించిన విద్యార్థి గణేష్‌ను మంగళవారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ గణేష్ తన జీవి తంలో మరెన్నో ఉన్నతమైన ర్యాంకులు సాధించాలని, అటు తల్లి దండ్రులకు, విద్యా సంస్థలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సంస్థల ఛైర్మన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

యువత ఓటును సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు నాయకుల తలరాతలను మార్చేదిగా ఉందని, యువత ఓటును సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి దూలం కిషోర్ తెలిపారు. మంగళవారం స్థానిక కొండవీటి డిగ్రీ మరియు గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులతో ఓటు విలువను గూర్చి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ యువజన వ్యవహారాలు , క్రీడ మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం కాకినాడ జిల్లా యూత్ ఆఫీసర్ శ్రీ దూలం కిషోర్ ఆదేశాల మేరకు ఇంటెన్స్ ఓటర్ ఎవర్నెస్ మరియు స్పోర్ట్స్ మీట్, నారీ శక్తి కార్యక్రమాన్ని శ్రీ గౌతమి జూనియర్ కళాశాల మరియు కొండవీటి డిగ్రీ కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె ఎస్‌డి ఆశీర్వాదం సమక్షంలో జరిగాయి. బలమైన ప్రజాస్వామ్యానికి దేశ అభివృద్ధికి యువత ఓటు చాల అవసరమని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, స్టాఫ్ , నేషనల్‌యూత్ వాలంటరీ వెంకటలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో అత్యాధునిక పరికరాలతో గుండె చికిత్స

విశాలాంధ్ర - అమలాపురం : కిమ్స్‌లో అత్యాధునిక పరికరాలతో గుండెకు చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు మెడికల్ డైరెక్టర్ డా. హరికిరణ్ వర్మ తెలిపారు. అంబాజీపేటకు చెందిన 57 సంవత్సరాల వ్యక్తి తీవ్రమైన ఛాతీ నొప్పితో 18వ తేదీన కిమ్స్ గుండె వైద్య విభాగ వైద్యులు డా అభిషేక్ రవి వర్మని సంప్రదించారు. రోగికి అవసరమైన పరీక్షలు జరిపి గుండెలో రక్త నాళాలు పూడుకొని పోవడం వల్ల రక్త సరఫరా తగ్గి నొప్పి వస్తున్నట్లు గమనించారు. 22వ తేదీన కిమ్స్ గుండె వైద్య నిపుణులు డా అభిషేక్ రవి వర్మ, డా గురు కిరణ్, డా నాగ గణేష్‌లతో కూడిన వైద్య బృందం రోగికి అత్యాధునిక ఓసిటి పరికరం సహాయంతో రక్త నాళాలలోకి కెమెరాను పంపి, గుండె లోపలి రక్త నాళాల దృశ్యాలను తెరపై చూస్తూ స్టెంటు అమర్చి రక్తనాళాలలో రక్త సరఫరా పని తీరు మెరుగు పరచారని తెలిపారు. ఈ ఆధునిక పరికరం వలన బైపాస్ సర్జరీ చేయవలసిన అవసరం లేకుండా స్టెంట్ వేయడం సాధ్యమైందని, తెలిపారు.

లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఓపీ క్లినిక్ ప్రారంభం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: స్థానిక డెల్టా హాస్పిటల్స్ లో లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఒపి క్లినిక్ ప్రారంభించినట్లు హాస్పిటల్ ఎమెర్జెన్సీ విభాగ వైద్యులు డా.నాగేశ్వరరావు, సీనియర్ కన్సల్టెంట్ హెమటాలజిస్ట్ డా. చందన్ కుమార్ చెప్పారు. లివర్ ట్రాన్స్ ప్లాంటేన్షన్ వైద్యులు డా అమర్నాథ్, గ్యాస్ట్రో ఎంటరా లజిస్ట్ డా రామ్ గోపాల్ తేజలతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ లివర్ మార్పిడికి సంబం ధించిన సమస్యలపై వచ్చేవారిని పరీక్షించి తగు సూచనలు చేయడానికి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఒపి క్లినిక్ పెట్టామని తెలిపారు.ప్రారంభ దశలోనే గుర్తించడం వలన లివర్ మార్పిడి వలన మంచి ఫలితాలు వస్తాయని, ముదిరిపోయాక లివర్ మార్పిడి చేసినా పెద్దగా ఫలితం కనిపించదని వారు పేర్కొన్నారు. దాదాపు 25లక్షల రూపాయల వరకు ఇందుకు ఖర్చు కాగలదని వారు ఒక ప్రశ్నకు సమాధానంగా చెబుతూ, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 10లక్షల వరకు మంజూరు అవుతోందన్నారు.

ఏపీ రైతు కూలీ సంఘంలోకి రామలింగేశ్వరావు

విశాలాంధ్ర - జగ్గంపేట : అఖిల భారత రైతు కూలీ సంఘం పెద్దాపురం డివిజన్ కార్యదర్శి కర్నాకుల రామలింగేశ్వరరావు ఆ సంఘానికి రాజీనామా చేసి మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘంలో చేరారు. ఆ సంఘం రాష్ట్ర నాయకులు వల్లూరి రాజబాబు సమక్షంలో రామలింగేశ్వరరావు పార్టీలో చేరడంతో, జగ్గంపేట కాపు కళ్యాణ మండపం వద్ద జిల్లా సహాయ కార్యదర్శి కడితి సతీష్ అధ్యక్షతన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న రాజీలేని భూమి, భుక్తి, ప్రజా సమస్యలపై పోరాటాలకు ఆకర్షితుడే రామలింగేశ్వరరావు ఆ సంఘం నుండి ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘంలోకి వచ్చారన్నారు. ఈ కార్యక్ర మంలో ఏఐఎఫ్టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంజిబాబు, ఏజెన్సీ డివిజన్ కార్యదర్శి దేశెట్టి సురేష్, జిల్లా నాయకులు దాన్ శీను, ఏఐఎఫ్ టియు నాయకులు వీరన్న, సోమరాజు, నాగమణి, గణపతి, రమణ, పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఆలమూరు : ఇటీవల మండపేటలో ఒలింపిక్ గేమ్స్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ వారిచే నిర్వహించబడిన గ్రేడింగ్ టెస్ట్ కాంపిటేషన్స్‌లో మండల కేంద్రమైన ఆలమూరు శ్రీ సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ఆ విద్యాసంస్థల అధినేత ముల్లా రావు తెలియజేశారు. కె అనుశ్రీ కార్తికా, వియస్ కార్తికేయ, వి గిరిజా, ఆర్ యన్‌వి అఖిల్, జి జాయ్ కిరణ్, జియస్ చైతన్య తమ ప్రతిభను కనబరిచి బహుమతులు కైవసం చేసుకున్నారు. ప్రిన్సిపల్, ప్రైమరీ ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

ఆదిరెడ్డి శ్రీనివాస్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: నోటికి ఏది వస్తే అది మాట్లాడి తన పరువు ప్రతిష్టలకు ఇబ్బంది కలిగించేలా చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రాజమండ్రి ఎంపీ, సిటీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ రామ్ తెలిపారు. మంగళ వారం నగరంలోని కోట గుమ్మం వైఎస్సార్ విగ్రహం వద్ద ఆయన మీడియా తో మాట్లాడారు. నగరాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దితే..అభివృద్ధి పనుల్లో 25 శాతం కమీషన్లు తీసుకుంటున్నానని టీడీపీకి చెందిన ఆదిరెడ్డి వాసు యూట్యూబ్ చానల్‌కు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వద్ద పదే పదే ఆరోపణలు చేశాడు కాబట్టి పరువు నష్టం దావా వేస్తున్నట్టు వెల్లడించారు. నగరంలో ప్రధాన సెంటర్లలో కూడా కొంతమంది వ్యక్తులకు టీడీపీ కండువాలు కప్పించి కరపత్రాలు పంపిణీ చేయించడం, లక్షల కరపత్రాలు ఎక్కడ పడితే అక్కడ జల్లడం..ఈ చర్యలన్నీ ఎంపీగా ఉన్న తన పరువు, ప్రతిష్టకు భంగం వాటిల్లేలా ఆదిరెడ్డి వాసుయే పనిగట్టుకుని చేయించినట్లు తెలుస్తోందన్నారు. ఎందుకంటే తనపై 25 శాతం కమీషన్లు అభియోగం మొట్టమొదట మోపింది ఆదిరెడ్డి వాసుయే అన్నారు. అందుకే అతనిపై ఐపీసీ 500 ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానని, పరువు నష్టం దావా కూడా వేసినట్లు తెలిపారు. ఇకపై ఎవరు ఇటువంటి అనుచిత ఆరోపణలు చేసినా వారిపై కూడా న్యాయ పరమైన చర్యలకు ఉపక్రమిస్తానని ఎంపీ భరత్ హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీగా మేము చేసిన అభివృద్ధి పనుల్లో లోపాలుంటే విమర్శలు చేయ వచ్చు..కానీ ప్రతీ అభివృద్ధి పనిలో 25 శాతం కమీషన్ తీసుకున్నట్టు, కమి షన్ల కోసమే అభివృద్ధి పనులు చేస్తున్నట్టు ఏ ఆధారం ఉందని మాట్లాడతా వని వాసును ఉద్దేశించి ఎంపీ భరత్ ప్రశ్నించారు. నేను ఎవరి వద్దనైనా 25 శాతం కాదు..ఒక్క శాతం కమీషన్ తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పుకోవడమే కాదు..ఊరు విడిచి వెళ్ళిపోతాను, మళ్ళా కనబడనని పదేపదే మీడియా సాక్షిగా ప్రకటించినా టీడీపీ వాసు నుంచి స్పందన లేదన్నారు. అయినా ప్రజలలో తనపై ఉన్న అభిమానం, గౌరవం సన్నగిల్లేలా చేయడానికి ఈ కమీషన్ల ఆరోపణలు ఆదిరెడ్డి వాసు చేస్తున్నా డన్నారు. వాసుకు వచ్చే ఎన్నికలలో ఓటమి తప్పదనే భయంతో ఇటువంటి చీప్ ట్రిక్స్ ప్లే చేస్తున్నాడన్నారు. తనపై ఎటువంటి ఆరోపణలు చేసినా బహిరంగ చర్చకు సిద్ధమే అన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక నగర పంచాయతీ పరిధిలో 6వ వార్డుకి చెందిన సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పార్టీ లోకి వచ్చిన వారికి ప్రత్తిపాడు నియోజక వర్గ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి సంక్షేమం పేరుతో పథకాలు ఇచ్చినట్లే ఇచ్చి మరొక చేత్తో నిత్య వసర ధరలు పెంచి పేదల నడ్డి విరిచారని అన్నారు. ప్రజలు జగన్ మోసపూ రిత పాలనను గ్రహిస్తున్నారని ఆమె అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ విజయం సాధించి పేదల సంక్షేమం కోసమే పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, బిజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - అన్నవరం/తుని : తొండంగి మండలం రావికంపాడు గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరారు. తేటగుంట దేశం పార్టీకార్యాల యంలో ఏపీ ప్రతిపక్ష నాయకులు పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామ కృష్ణుడు వీరందరిని దేశం ఖండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోడూరి లచ్చన్న దొర, సిద్ధా చిట్టి వెంకయ్య, మెడిసెట్టి సత్తిబాబు,నాగం దివా ణం, వెల్నాటి బుజ్జి,అమర్తి వీర్రాజులతో పాటు 10 కుటుంబాలు చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ యనమల దివ్య విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యనమల రాజేష్, మోత్కూరి వెంకటేష్, రావికంపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయానికి కృషి చేద్దాం

విశాలాంధ్ర - దేవరపల్లి : గోపాలపురం కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గాల నుండి మద్దిపాటి వెంకట రాజు ముప్పిడి వెంకటే శ్వరరావులను భారీ మెజారిటీతో గెలిపించుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని అసమ్మతి వాదుల్లారా కలిసి పని చేద్దాం రండి అని దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్ పిలుపు నిచ్చారు. దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆంద్రు అనిల్ మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా మద్దిపాటి వెంకటరాజు ముప్పిడి వెంకటేశ్వరరావులు పోటీపడ్డారని ఆయన అన్నారు. అధిష్టాన వర్గం మద్దిపాటి వెంకట్ రాజుకు టిక్కెట్ కేటాయించిందని మనందరం అధిష్టానం వర్గం ఆదేశాలను అనుసరించి మద్దిపాటి వెంకటరాజు విజయానికి కృషి చేద్దామని అన్నారు . టిక్కెట్టు కోసం ప్రయత్నించటం తప్పు లేదని ఆశావాహులుగా మద్దిపాటి వెంకట రాజుకు ముప్పిడి వెంకటేశ్వరరావుకు అధికారం ఉందని అన్నారు గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గానికి ముప్పిడి వెంకటేశ్వరరావును కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గానికి పార్టీ టికెట్ కేటాయించింది అన్నారు . అధిష్టాన వరకు మద్దిపాటి వెంకట్ రాజుకు ముప్పిడి వెంకటేశ్వరరావు ఇద్దరికీ న్యాయం చేసిందని గుర్తు చేశారు గోపాలపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకటరాజును గెలిపించుకోవటానికి చిన్నచిన్న విభేదాలు ఉంటే పక్కనపెట్టి అందరూ సమిష్టిగా కృషిచేసి వెంకటరాజును గెలిపించుకుందామని అన్నారు. ఈ సమావేశంలో తెలుగు దేశం సీనియర్ నాయకులు సుబ్బారావు, రామారావు బుల్లిన భాస్కర్ సాంబ సూర్య చంద్రం సత్యనారాయణ, అంజిబాబు, ధ్రువ కాంత్, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రంగాలకు జగనన్న చేయూత..

విశాలాంధ్ర - కొవ్వూరు : స్వయంఉపాధి రంగాలకు జగనన్న ప్రభుత్వం చేయూతనందిస్తుందని నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరు 17వ వార్డులో మంగళవారం ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో తలారి పాల్గొన్నారు. సైకిల్ రిపేర్ షాప్ లో సైకిల్ ట్యూబుకు బ్యాచ్ వేశారు. మటన్,ఫిష్ మార్కెట్లలో కార్పెంటర్ వర్క్ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కట్ట ఉమామహేశ్వరి,టౌన్ ప్రెసిడెంట్ రూత్తల భాస్కరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, కౌన్సిలర్ కంఠ మణి రమేష్ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమతవ్వకాల వల్లే ...
కుంగిన గ్రామ్ ఇండియా బ్రిడ్జి

విశాలాంధ్ర - కొవ్వూరు : ఇసుకాసురులు రెచ్చిపోయి గోదావరిలో వంతెనలకు సమీపంగా డ్రగ్జింగ్ నిర్వహిస్తూ ఇసుకను తీయడం ద్వారా 808 కోట్లతో నిర్మించిన గామన్ ఇండియా బ్రిడ్జి కుంగిపోయే స్థాయికి దిగజారింది. వంతెన సమీపంలో డ్రగ్జింగ్ ద్వారా తవ్వకాలు చేయవద్దని రాష్ట్ర హైకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ సైతం ఆదేశాలు జారీ చేసిన వైకాపా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేకపోవడం గమనార్హం. పైగా గతంలో రాత్రుళ్ళు అక్రమ ఇసుకను తీసే అక్రమార్కులు ఇప్పుడు పగలు సైతం రెచ్చిపోతున్నారు. దీనికి కారణం ప్రభుత్వం అండలే వారికి ఉన్నట్లు సమాచారం సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్ బంధువులు కడప నుంచి వచ్చి కొవ్వూరులో రాంపులను మెయింటెన్ చేస్తున్నారు. ఇక అధికారులు మాత్రం ఏం చేస్తారు? చేతులు ఎత్తయిడంతో పాటు తమ వంతు సహాయాన్ని వారికి అందిస్తున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. నిన్న గ్రాముస్ ఇండియా బ్రిడ్జి కుంగినప్పుడు జిల్లా కలెక్టర్ సైతం బ్రిడ్జి వద్దకు వచ్చి పరిశీలించారు. అప్పుడు చాలామంది కలెక్టర్ దృష్టికి అక్రమార్కుల విషయం తెచ్చారని తెలుస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన అధికారులు చర్యలు తీసుకోవాల్సింది పోయి మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ విషయమే ఎన్నికల సంఘం రంగంలోకి దిగితే గాని అక్రమార్కుల ఆటలకు అడ్డుకట్ట పడదని విశ్లేషణలు భావిస్తున్నారు. ఎందుకంటే గతంలో అధికారులు ప్రభుత్వం కింద పనిచేసేవారు. ఇప్పుడు అధికారాలన్నీ ఎన్నికల సంఘం చేతిలోకి వెళ్లడంతో భవిష్యత్ తరాలకు అవసరమైన గ్రామన్ ఇండియా బ్రిడ్జి, రోడ్డుకి రైల్వే వంతెనలకు వాటిలో ముప్పు తప్పుతుందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

పురందేశ్వరిని కలిసిన ఆస్క్ శేఖర్

విశాలాంధ్ర - నల్లజర్ల : రాష్ట్రంలో ఉన్న ఎస్సీ ఎస్టీలకు పూర్తి ఉచిత విద్య, పూర్తి వైద్యం ఉచితంగా అందించాలని రాష్ట్ర అంబేద్కర్ ఆశయ సాధన పోరాట కమిటీ అధ్యక్షులు రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురందరేశ్వరుని కోరారు. మంగళవారం నాడు విజయవాడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆస్క్ సభ్యులు బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరిని ప్రత్యేకంగా కలిశారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు బాగుపడాలంటే విద్యతోనే సాధ్యమని అంబేద్కర్ ఆశ సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ వివరించారు.

ఎంపీ భరత్‌కు విశ్వబ్రాహ్మణ సంఘం సంఘీభావం

విశాలాంధ్ర - రాజ మహేంద్ర వరం : నగరంలో విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయించిన రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ కు రాజమండ్రి అర్బన్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం అధ్యక్షుడు లక్కోజి వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి అముపోజు శివప్రసాద్, కోశాధికారి గోర్సా వెంకటరమణ, రాష్ట్ర నాయకుడు అనుపోజు వెంకటరమణ, వైసీపీ నాయకులు, గుంటముక్కల రాజు,లక్కోజు ఓంకార్ ధవళేశ్వరపు రవిశంకర్ తదితరులు మాట్లాడారు. లక్కోజు వీరభద్రరావు మాట్లాడుతూ కమ్యూనిటీ హాలు కావాలనే తమ కోరిక ఇంతకాలానికి నెరవేరిందని హర్షం వ్యక్తంచేశారు. ఎంపీ భరత్ చొరవతో స్థలం కేటాయించారని కృతజ్ఞతలు తెలిపారు.అనుపోజు వెంకటరమణ మాట్లాడుతూ గతంలో రౌతు సూర్యప్రకాశరావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విశ్వ బ్రాహ్మణులకు మేలు చేశారని ఇప్పుడు సీఎం జగన్ ద్వారా ఎంపీ మార్గాని భరత్ తమకు కమ్యూనిటీ హాలుకు సహకరించారని పేర్కొన్నారు.గుంటముక్కల రాజు,లక్కోజు ఓంకార్ ధవళేశ్వరపు రవిశంకర్ మాట్లాడుతూ టీడీపీలో ఉన్న కొందరు విశ్వబ్రాహ్మణ నాయకులు రాజమండ్రి నగరంలోని 90 శాతం సంఘీయులు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నారని చెప్పడం సరికాదన్నారు.తామంతా వైసీపీలో ఉన్నామని రానున్న ఎన్నికల్లో సిటీ వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్ రామ్ విజయానికి కృషి చేస్తామని చెప్పారు.అప్పుడు రౌతు సూర్యప్రకాశరావు, ఇప్పుడు భరత్ వల్ల తమ సామాజిక వర్గానికి చెందిన పేదలకు ఇళ్ళ స్థలాలు,వాంబే గృహాలు ఇప్పించగలిగామని అన్నారు. టీడీపీ హయాంలో ఒక్క ఇల్లు ఇవ్వలేదని వారు విమర్శించారు. ఆయనను ఎమ్మెల్యేగా అధిక మెజారిటీతో గెలిపించుకుంటా మని వారు చెప్పారు.విలేకరుల సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు కోసూరి గోపాలరత్నం (గోపి),కొమ్మోజు రాధాకృష్ణ, స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు దార్ల బాలమురళీకృష్ణ, గున్నాబత్తుల ఉమామహేశ్వర రావు, వైసీపీ నాయకులు కొమ్మోజుదుర్గారావు, పొడుగు శ్రీను, తాళాబత్తుల అనిల్,తాళాబత్తుల దర్మారావు, స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు వీర్ని వీరభద్రరావు, కడియం మోహనరావు, రత్న పాల్గొన్నారు.

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా రెడ్డి సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర - కొత్తపేట : తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యుడిగా రెడ్డి సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెడ్డి సుబ్రహ్మణ్యం రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జిగా మూడు సంవత్సరాలుగా పని చేసారు. తెలుగు దేశం పార్టీలో అత్యున్నత హోదా కలిగిన పొలిట్ బ్యూరో సభ్యుడిగా నియమించి పార్టీ అధిష్టానం రెడ్డి సుబ్రహ్మణ్యానికి తగిన గౌరవం ఇచ్చింది. ఆయనను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పార్టీకి ఆయన సేవలు వినియోగించుకోవాలని చూస్తోంది. పొలిట్ బ్యూరో సభ్యుడిగా నియమించడంతో జిల్లాలో టీడీపీ నాయకులు సంతోషం వ్యక్తం చేసి పలువురు అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న లారీ

విశాలాంధ్ర - అంబాజీపేట : అంబాజీపేట నుండి ముక్కామల వైపు వెళ్తున్న లారీ మంగళవారం అంబాజీపేట బస్టాండ్ సమీపంలో ట్రాన్స్ ఫార్మర్‌ను ఢీ కొట్టింది. లారీ వేగానికి విద్యుత్ స్తంభం ట్రాన్స్ఫార్మర్‌తో సహా ఎగిరిపడింది. ఆ సమయానికి రోడ్డు ప్రక్కన ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి సర్వారాయ సుగర్స్ బాటిలింగ్ కంపెనీ నుండి కిన్ లే వాటర్ బాటళ్లను అంబాజీపేట డిస్ట్రిబ్యూటర్‌కు తీసుకువచ్చి అన్లోడ్ చేశారు. అంబాజీపేట బస్టాం డ్ వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు కళ్ళు తిరిగి స్టీరింగ్ పై పడిపోయాడు. దీంతో ఎడమ వైపుకు వేగంగా వెళ్లిన లారీ ప్రమాదానికిలోనై డ్రైన్‌లో పడిపోయింది. అంబాజీపేట పోలీసులు, విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, అంబాజీపేట ఎస్సైకేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థికసాయం అందజేత

విశాలాంధ్ర - రావులపాలెం : వెదిరేశ్వరం గ్రామ నివాసియైన బట్న విల్లి రామారావు అనారోగ్యంపాలై చికిత్స చేయించుకొనుటకు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇబ్బంది పడుచున్నారని తెలుసుకొన్న ప్రభుత్వ విప్, కొత్తపేట శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి వారికి అత్యుత్తమ చికిత్సను అందించటానికి బొల్లినేని హాస్పిటల్ రాజమహేంద్రవరం వారితో మాట్లాడి అడ్మిట్ చేయించారు. ప్రభుత్వ విప్ కొత్తపేట శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి హోండా షోరూం నాగిరెడ్డి డాక్టర్‌లతో మాట్లాడి ఉత్తమ చికిత్స అందించాలని చెప్పారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

విశాలాంధ్ర - సీతానగరం : గోదావరిలో ఈతకు వెళ్లి యువకుడు మృతి. మండలంలో ముగ్గుళ్ళ గ్రామంలో గల గోదావరిలో మంగళవారం నలుగురు యువకులు ఈతకు వెళ్లి గోపాల శివశంకర్ వయస్సు 21, తండ్రి పేరు నగేష్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రఘుదేవపురం గ్రామ పంచాయితీ పరిధిలో వడ్డీల పేటకు చెందిన బంధువు పోలవరం గ్రామానికి చెందిన నగేష్ కుమారుడు శివ శంకర్, మరో ముగ్గురు వడ్డీల పేటకు చెందిన యువకులు సరదాగా ఈతకు వెళ్లగా ప్రమాదవశాత్తు మృతి చెందాడు అని అన్నారు. దీనిపై స్థానిక ఎస్ ఐ టి రామకృష్ణ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజ మహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమానికి ఓటు వేసి గెలిపించండి : వరుపుల

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరొక్కసారి ఆశీర్వదించి గెలిపించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి అసెంబ్లీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. ఈ మేరకు ఆయన మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా గడప గడపకు వైఎస్సార్సీపీ కార్యక్రమంను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందజేసిన ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రవ్యాప్తంగా రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్లో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తి దారుల సంఘం జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడిచినా నేటికీ రజకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చాలా వెనకబడి ఉన్నారని, ఏ ప్రభుత్వాలు వచ్చినా రజకుల అభివృద్ధి లేదన్నారు. వృత్తి నిర్వహణలో యంత్రాలు ప్రవేశించినందు వలన ఉపాధికి గండి పడే అవకాశం ఉందని అన్నారు. రజక వృత్తిదారులకు స్టీమ్ ఐరన్ ఇస్త్రీ చేసేందుకు 250 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలని, అర్బన్ కేంద్రాల్లో మోడ్రన్ ధోబి గార్ట్స్ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ సంస్థలు, దేవస్థానాల్లో ఉన్న రజక వృత్తి ఉపాధిని రజక కుటుంబాల్లో ఉన్న యువతకు అవకాశం కల్పించాలని రాజు డిమాండ్ చేశారు. రజక వృత్తి చెరువులు కుంటల స్థలాలు పైన రజకులకే పూర్తి హక్కు కల్పించాలని, 50 సంవత్సరాల పూర్తయిన రజకులకు పెన్షన్లు ఇవ్వాలని రాజు డిమాండు చేశారు. వృత్తిదార సంఘం నాయకులు కొజ్జవరపు మాణిక్యం, కె త్రిమూర్తులు, వి రాజు, ఎస్ రాజేష్, సిహెచ్ శ్రీను, గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి కృషి చేస్తా : సతీష్ కుమార్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ పార్లమెంటు సీటు కోసం కాకినాడ నుంచి టీడీపీ, జనసేనల చెందిన పార్టీల నుండి పార్లమెంటు టికెట్ ఆశించానని అది రాకపోయినా నిరాశ లేదని ఆ పార్టీల విజయానికి తన వంతు ఎనలేని కృషి చేస్తానని కూటమి తరుపున కాకినాడ పార్లమెంట్ సీటు ఆశించి బంగపడ్డ సానా సతీష్ కుమార్ తెలిపారు. తాను కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రచారంలో పాల్గొంటానని వారి విజయానికి శ్రమిస్తానని సతీష్ చెప్పారు. మంగళవారం కాకినాడ ఏడిబి రోడ్డు అచ్చంపేట జంక్షన్లో ఉన్న కొప్పవరం గ్రామంలోని తన కార్యాలయంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చిన తనకు రాజకీయాలలోకి రావాలనుకున్నానన్నారు. తద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి సేవ చేసే అవకాశం నిమిత్తం రాజకీయాల్లో వద్దామనుకున్నానని చెప్పారు. కొంతకాలంగా కాకినాడ పార్లమెంటు పరిధిలో అనేక సేవ కార్యక్రమాలు, క్రీడల పోటీలు నిర్వహించి కాకినాడ పార్లమెంటు సీటు ఆశించానన్నారు. తాను కాకినాడ పార్లమెంట్ సీటును టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నాయకులతో సన్నిహితంగా మెలుగుతూ ప్రయత్నం చేశానన్నారు. తనకు టికెట్ రాలేకపోయినా నిరాశ చెందలేదని కూటమి తరుపున ప్రచారం చేస్తానని చెప్పారు. అలాగే పవన్, చంద్రబాబు యాత్రలలో పాల్గొంటానని చెప్పారు. జగన్ ఓటమి లక్ష్యంగా కూటమి గెలుపే ప్రాధాన్యంగాను పనిచేస్తానని సానా సతీష్ కుమార్ తెలిపారు.

సమసిన వివాదం ... అధికారులదే నిర్ణయం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడలోని శివాలయంలో దాడి చేసిన వివాదం సమసినదని ఇక నిర్ణయం అధికారుల చేతుల్లో ఉందని భంగపడ్డ అర్చకులు తెలిపారు. మంగళవారం కాకినాడ శివాలయంలో గాయాలైన అర్చకులు కొడమంచిలి కార్తీక శర్మ, పెద్దసోమయాజుల వెంకట సత్యసాయి, మద్దిరాల వెంకట విజయ్ కుమార్లు విలేకరులకు తెలిపారు. నిందితుడు సిరియాల చంద్రరావు దాడి చేశారని తమ శాఖాధికారులతో పాటు పోలీసులకు తాము ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై దేవాదాయ శాఖ అధికారులు, పోలీసులు విచారణ చేశారని ఇక తమ శాఖ అధికారులు ఏమి చెప్పిన శిరసా వహిస్తామన్నారు. తమకు పెద్దల సమక్షంలో సిరియాల చంద్రరావు క్షమాపణ చెప్పారని అందుకు అనగుణంగా లిఖితపూర్వక హామీ తీసుకున్నట్లు తెలిపారు. తమను వివాదాల్లోకి లాగ వద్దని వారు వేడుకున్నారు.

రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా వాసిరెడ్డి ఏసుదాసు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రూరల్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసుకి నారా చంద్ర బాబు నాయుడు రాష్ట్ర కమిటీ లో కార్యదర్శిగా సముచితమైన స్థానం కల్పించడం పట్ల టిడిపి జోన్ 2 ఇంచార్జ్ విజయ్ కృష్ణ రంగారావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక రమణయ్యపేట వాసిరెడ్డి ఏసు దాసు తన నివాసంకి టిడిపి, జనసేన బృందం విజయ్ కృష్ణ రంగారావు, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, సానా సతీష్ బాబు, గుణ్ణం చంద్రమౌళి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి మాట్లా డుతూ మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నాకు సముచితమైన స్థానం కల్పించిన సందర్భంగా ఆయన ఆదేశాలతో నా దగ్గరికి వచ్చి అభినందనలు తెలిపినందుకు తప్పకుండా ఏడు నియోజక వర్గాల్లో టిడిపి, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిస్తానని వాసిరెడ్డి భరోసా ఇచ్చారు.

వేసవిలో కనీస జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర - కాకినాడ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణం మోడ్రన్ కాలేజ్ వద్ద గల న్యూ లైఫ్ షాలోమ్ బాప్టిస్ట్ చర్చ్ వద్ద సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ ఆలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకన్న అధ్యక్షతన మెగా ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి, అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎక్కువగా మంచి నీరు, మజ్జిగ వంటివి తీసుకుంటూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డాక్టర్ కెవివి సత్యనారాయణ, డాక్టర్ ఇసాదీప్తి సుమారు 550 మంది రోగులను పరీక్షించి వారికి అవసరమైన మొదలు ఉచితంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ కూరెళ్ల సూర్యప్రకాశం, అలై వనుం ఉపేంద్ర నాథ్, నాగమణి, శ్యామల, నేదూరి శేషగిరి, ఈతా ప్రసాద్, బంగారు బాబుపాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీసెల్ చైర్మన్‌గా దాసరి కుటుంబరావు

విశాలాంధ్ర - గోపాలపురం : రాజమండ్రి జిల్లా కాంగ్రెస్ఎస్సీ సెల్ చైర్మన్ గా గోపాలపురం పెద్దగూడెంకు చెందిన దాసరి కుటుంబరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ సాకే శంకర్ ఈ నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. విజయవాడలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో కుటుంబరావు జిల్లా చైర్మన్గా నియామకపు పత్రాన్ని రాష్ట్ర చైర్మన్ శంకర్ చేతుల మీదుగా అందు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారకులైన రాహుల్ గాంధీకి ఏపిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డికి కుటుంబరావు కృతజ్ఞతలు తెలియజేశారు.